
హైదరాబాద్ వార్త



# అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు

**మంత్రి పొన్నం ప్రభాకర్**



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త**

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర బి సి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్‌లో హైదారాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు అధికారుల మంత్రి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 10వ తేదిన జిల్లా కలెక్టర్లు రాష్ట్ర స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 4 పథకాల ప్రారంభోత్స వానికి సంబంధించి సమీక్షా సమావేశం ముఖ్యమంత్రి నిర్వహించారన్నారు. హైదారాబాద్‌కి సంబంధించి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక ఈ రెండు పథకాలు హైదరాబాద్, జీహెచ్ఎంసీ పరిధిలో లేనందున మిగతా రెండు కార్యక్రమాలు రేషన్ కార్డులు పంపిణీ ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుల ఎంపిక చేయనున్నామన్నారు. ప్రతి లబ్ధిదారులకి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రధాన లక్ష్యంగా సర్వే ఎంపిక జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ లబ్ధి జరిగేలా ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. హైదరాబాద్ ప్రజలకు విజ్ఞప్తి చేసుకున్నా సర్వే అనంతరం అధికారులకు సమాచారం ఇవ్వచ్చున్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం అర్హులందరికీ న్యాయం చేస్తుందన్నారు. ప్రజలు రాజకీయ ప్రలోభాలకు గురికావద్దన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం రేషన్ కార్డులు నిరుపేదలకు అందించేందుకు స్పష్టమైన నిర్ణయం తీసుకుందన్నారు. రేషన్ కార్డులు ఇవ్వడానికి కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని చెప్పారు. అన్ని ఉమ్మడి జిల్లాలో ఇన్‌చార్జి మంత్రులు సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈరోజు హైదరాబాద్ జిల్లా సమావేశం జరిగిందన్నారు.ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అధికారులతో సమావేశం జరిగింది. వారి సూచనలు పరిగణలోకి తీసుకొని అవసరమైతే ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటున్నాం. ప్రజలందరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.ఈనెల 16 నుండి 20వ తేది మధ్య ఫీల్డ్ వెరిఫికేషన్ జరుగుతుంది. ఫీల్డ్ వెరిఫికేషన్ తరువాతవచ్చిన జాబితా వార్డుల వారీగా గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేస్తారు. 21-25 మధ్య డేటా ఎంట్రీ పూర్తిచేసి ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం కేటాయించింది. 26 నుండి కొత్త రేషన్ కార్డులు వస్తాయి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ప్రకటన ఉంటుంది. హైదరాబాద్‌లో స్వంత స్థలం ఉండి ఇళ్లు లేని వారికి 50 శాతం అప్లికేషన్‌లు వచ్చాయి. ఇంకా సర్వే త్వరలో పూర్తి చేసిన తర్వాత అర్హత గల లబ్ధిదారుల జాబితా తెలుస్తుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ 10 లక్షల 70 వేల 463 దరఖాస్తులు ప్రజాపాలనలో రాగా అందులో 50 శాతం సర్వే చేయగా అందులో ఇంటి స్థలం ఉన్నవారు 9,913 మంది ఉన్నారని మంత్రి తెలిపారు. అయినప్పటికీ హైదరాబాద్‌లో స్థలం అంశం ప్రత్యేకమైనదని అందుకు నిరుపేదలకు మంచి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, ప్రజా ప్రతినిధులు సూచన మేరకు మల్టీ స్టోర్ కట్టడానికి లేదా స్లమ్స్ డెవలప్ చేసి ఇల్లు నిర్మించేలా యాక్షన్ ప్లాన్ తీసుకున్నామని మంత్రి పేర్కొన్నారు.

# కారు వెనుక కారు..!

## హైవే ఫుల్ ట్రాఫిక్.. రైళ్లు, బస్సుల్లో సీట్ల కోసం పాట్లు



**హైదరాబాద్, జనవరి 13 ప్రభాతవార్త**

సిటీ ఖాళీ అయ్యే కొద్దీ జాతీయ రహదారులపై ట్రాఫిక్ అంతకంతకూ పెరుగుతోంది.లక్షల సంఖ్యలో వాహనాలు ఏపీ, తెలంగాణ జల్లాల వైపు దూసుకెళుతున్నాయి.కారు వెనుక కారు అన్నట్లు.. జాతీయ రహదారుల్లో ట్రాఫిక్ ఉంటోంది.కార్లతో పాటు ప్రైవేటు, ఆర్టీసి బస్సులు, టూ వీలర్స్‌పై వెళ్లే వారితో హైవే మొత్తం కిటకిటలాడుతుంది. ఇక రోడ్ల పక్కన హోటల్స్, టీ స్టాల్స్ అయితే ఫుల్ రష్‌గా నడుస్తున్నాయి. ఆదివారం సెలవు కలిసి రావటంతో తెల్లవారు జాము నుంచే లక్షల మంది సొంతూళ్లకు బయలుదేరి వెళుతున్నారు. ఉదయం పొగ మంచు ఉండటంతో..ఎక్కువ మంది ఆరు నుంచి ఏడు గంటల మధ్య నగరంనుంచి బయలుదేరారు. దీంతో రష్ ఒక్కసారిగా విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్ టూ విజయవాడ, హైదరాబాద్ టూ వరంగల్, హైదరాబాద్ టూ కరీంనగర్,హైదరాబాద్ టూ బెంగళూరు..జాతీయ రహదారులపై విపరీతమైన రద్దీ ఉండగా..ఇక చౌటుప్పల్,పంతంగి టోల్ గేటు దగ్గర అయితే విజయవాడ వైపు ఎక్కువ బూత్‌లు పెట్టారు. ఎనిమిది బూత్‌లు ఓపెన్ చేసినా..ట్రాఫిక్ ఎక్కువగానే ఉంది. ఫాస్ట్ ట్యాగ్ ఉన్నా..టోల్ గేటు దాటటానికి కనీసం 15 నుంచి 20 నిమిషాల సమయంపడుతుందని అంటున్నారు వాహనదారులు. ఎపిఎస్ ఆర్టీసి, టిఎస్ఆర్టీసి ఎపిలోని పలు ప్రాంతాలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసింది. సొంతవాహనాలు కార్లు, బైక్‌లు ఇత వాహనాలు ఉన్నవారు తమతమ వాహనాల్లో గ్రామాలకు వెళుతున్నారు.కాగా, ఎల్బీనగర్ నుంచి దండు మల్కాపురం వరకు ఆరువరుసల రహదారి విస్తరణ పనులు జరుగుతుండటంతో పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

**అడ్డగోలుగా ప్రైవేటు నిలువు దోపిడీ...**

ప్రైవేటు ట్రావెల్స్‌పై నియంత్రణ లేక రవాణా శాఖ చేష్టలుడిగి చూస్తోంది. సంక్రాంతి పర్వదానాల్లో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నా అధికారులు నియంత్రించ లేకపోతున్నారు. ఆర్టీసి బస్సుల్లో టిక్కెట్ల ధరలతో పోలిస్తే ప్రైవేటు బస్సుల్లో మూడు రెట్లు అధికంగా వసూళ్లు చేస్తున్నారు. వైజాగ్, శ్రీకాకుళం, వలాస, విజయనగరంలాంటి సుదూర ప్రాంతాల రైళ్లు మూడు నెలల క్రితమే నిండిపోయాయి.

దీంతో సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లాను కునే వారు ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. హైదరాబాద్-వైజాగ్‌కు రైలులో థర్ట్ ఏసీ రూ. 1200వరకు ఉంటే స్లీపర్ బస్సుల్లో రూ.3500-4000 వసూలు చేస్తున్నారు. నాన్ ఏసీ బస్సుల్లో రూ.2500-3000 మధ్య ఉన్నాయి. నలుగురున్న కుటుంబానికి బస్సుల్లో రానుపోను రూ. 20 వేలపైన ఖర్చవుతోంది. దూర ప్రాంతాలకు స్లీపర్ బస్సుల్లోనే వెళ్లానుకుంటున్నారు కాబట్టి నలుగురున్న కుంటుంబానికి రానుపోను రూ. 30 వేలపైనే వెచ్చించాల్సి వస్తోంది. ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్ బుక్ చేసుకునే వెసులుబాటున్న యాప్‌లలో ఈ దందా యథేచ్ఛగా నడుస్తోంది.

**విమానాలు ఫుల్..చుక్కాల్లో ఫ్లైట్ చార్జీలు..**

సంక్రాంతి పండుగ ప్రయాణ సందడి ఆకాశ యానంపైనా పడింది. ప్రధానంగా రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడకు హైదరాబాద్ నుంచి బయలుదేరే విమానాలు ప్రయాణికులతో రద్దీగా ఉంటున్నాయి. ఆదివారం, సోమవారాల్లో ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన విమానాల్లో దాదాపుగా సీట్లన్నీ బుక్ అయ్యాయి.దీంతో ప్రయాణ చార్జీలు చుక్కలనంటుతున్నాయి.విశాఖపట్నానికి సాధారణ సమయాల్లో మూడువేల నుంచి నాలువేల రూపాయలు ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.20వేలకు పైచిలుకు చార్జీలు వసూలు చేస్తున్నారు. విజయవాడ, రాజమండ్రి వెళ్లే విమానాల్లో కూడా కనీసం రూ.15వేలకు తగ్గకుండా చార్జీలున్నాయి. ఇందులోనూ నేరుగా కాకుండా వయా ఢిల్లీ, బెంగళూరు తదితరప్రాంతాల నుంచి వెళ్లే విమానాలు మాత్రమే ఎక్కువ సంఖ్యలో అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రయాణ సమయం కనీసం 10 నుంచి 16 గంటల వరకు ఉంది.



# హైడ్రా వల్ల ప్రభుత్వానికి డ్యామేజ్

**తాను ఏది మాట్లాడినా సెన్సేషన్ అవుతుంది.. మరోసారి దానం నాగేందర్ హాట్ కామెంట్స్**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం

**హైదరాబాద్, జనవరి 12 ప్రభాతవార్త**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. తాను ఏది మాట్లాడినా సెన్సేషన్ అవుతుందన్నారు. ఈ కార్ రేసు వల్ల హైదరాబాద్ ఇమేజ్ పెరిగిందనే తాను చెబుతున్నానని, అలా అని అవినీతి కాలేదని తాను చెప్పలేదన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా వల్ల ప్రభుత్వానికి డ్యామేజ్ అయిందని మళ్లీ చెప్తున్నాను. మూసిపై కంటి తుడుపు చర్యల్లాగా ఒక్కరోజు మూసి నిద్రచేశారని.. వారు నిద్ర చేయడానికి వెళ్లే ముందే ఏసీలు పెట్టించుకుని పడుకున్నారని విమర్శించారు.వారి ఇళ్ళల్లో చేసిన జొన్న రెట్టేలు తినకుండా.. కిషన్‌రెడ్డి బయట నుండి ఇడ్లీలు తెప్పించుకుని తిన్నారని అన్నారు. తాను ఫైటర్‌నని, ఉప ఎన్నికకు భయపడనని.. ఎప్పుడో జరిగిన అంశంపై స్టేట్‌మెంట్ కూడా ఇచ్చానన్నారు. హైడ్రాపై ఓ ఇంటర్వ్యూలో మాట్లాడానన్నారు.. దానిని కొంతమంది మీడియా వాళ్ళు చెడుగా ప్రచారం చేస్తున్నారన్నారు.

**కెటిఆర్‌కి క్లీన్ సర్టిఫికెట్ ఇవ్వలేదు..**

తానేమీ కేటీఆర్‌కు క్లీన్ సర్టిఫికెట్ ఇవ్వలేదన్నారు. ఈ కార్ రెస్ పెట్టినప్పుడు కేటీఆర్ తన సలహా కూడా తీసుకున్నారని, అప్పుడు తన ఒపీనియన్ మాత్రమే చెప్పానని దానం నాగేందర్ అన్నారు. ఈ కార్ రెస్ వల్ల హైదరాబాద్ ఇమేజ్ పెరిగిందని, హైదరాబాద్ కాస్ట్ ఆఫ్ లివింగ్ తక్కువగా ఉందని, ఇక్కడికి కొన్ని సంస్థలు వచ్చి సెట్టిల్ అయ్యాయన్నారు. హైదరాబాద్ సేఫెస్ట్ సిటి కాబట్టి ముంబైకి వెళ్ళే ఇన్వెస్టర్లు ఇక్కడికి వస్తున్నారన్నారు. కేటీఆర్ కేసు కోర్టులో ఉంది కాబట్టి తాను కేటీఆర్‌పై మాట్లాడనని అన్నారు. రాష్ట్రంలో లోటు బడ్జెట్‌లో ఉన్నా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎలాగైనా నెరవేర్చాలని ముందుకెళ్తోందన్నారు. రైతు రుణ భరోసా చేసిన రోజు ఎంతో సంబరాలు చేయాల్సి ఉండే.. కానీ చేయలేదన్నారు. హైడ్రాపై తన వాఖ్యలు ఇప్పుడు కూడా మారదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆలోచించి హైడ్రాపై మరోసారి ఆలోచన చేయాలని కోరుతున్నానన్నారు. మూసికి అనుకుని హై కోర్టు, ఉస్మానియా లాంటివి ఎన్నో చారిత్రక నిర్మాణాలు ఉన్నాయని, మూసి ప్రక్షాళన చేసి సుందరీకరణ చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే దానం నాగేందర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## సిలిండర్ నుంచి గ్యాస్‌లీకై మంటలు...

**సకాలంలో ఆర్పివేయడంతో తప్పిన ప్రమాదం**



మంటలను ఆర్పివేస్తున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది

**హయత్‌నగర్, జనవరి 12 ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగ సందర్భంగా పిండి వంటలు చేస్తుండగా సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు వచ్చాయి. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనలో అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. వివరాలు... హయత్‌నగర్ నుంచి తొర్రూర్ వెళ్లేదారిలో ఎస్‌విఎస్ ఫంక్షన్‌హాలు ముందు రేకులగదిలో రామచంద్రయ్య(70) కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంట్లో పిండి వంటలు చేస్తుండగా సిలిండర్ రెగ్యులేటర్ నుంచి గ్యాస్ లీకై మంటలు వచ్చాయి. రామచంద్రయ్య కుటుంబసభ్యులు స్థానికుల సహాయంతో మంటలను ఆర్పడానికి యత్నించారు. అంతలో సమాచారం అందుకున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# పండుగకు పిండివంటలెట్లా..!

*** వంటింట్లో ధరల మంట * ఉల్లి, వెల్లుల్లి, పప్పులకూ రెక్కలు * భారీగా పెరిగిన వంట నూనెల రేటు * పండగ వేళల్లో వినియోగదారులపై భారం**





**హైదరాబాద్, జనవరి 10 ప్రభాతవార్త**

పండుగల సీజన్‌లో నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి.నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటడంతో పేద,మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వంట నూనె, పప్పుల ధరలు కొనలేనంతగా ఉండడంతో లబోదిబోమంటున్నారు. హోల్ సేల్ మార్కెట్లు, మాల్స్‌లోనూ సరకులన్నీ తగ్గేదేలే అన్నట్టుగా పైకి ఎగబాకుతున్నాయి. కేంద్రం కేవలం ఆయిల్‌ఫామ్, సోయా, పొద్దుతిరుగుడు లపై మాత్రమే సుంకం విధించినా.. మిగిలిన అన్ని వంట నూనెల ధరలను కంపెనీలు, వ్యాపారులు పెంచేశారు. పండగల సీజన్‌ను వారు తమకు అవకాశంగా తీసు కోవడంతో నూనెల ధరలు మండుతున్నాయి. నగరాలు, పట్టణాల్లోని దుకాణాల్లోనే కాదు.. గ్రామాల్లోనూ పెరుగు దల భారీగాఉంది. ఆన్‌లైన్ విక్రయ సంస్థలూ పెంచాయి. మాల్స్‌లోని నిల్వలను నల్లబజారుకు తరలించి.. అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రాష్ట్రంలో రోజుకు 100 టన్నుల నూనె వినియోగమవుతుంది. పండగల సమయాల్లో రోజుకు 150 టన్నులు వినియోగిస్తారు. ఈ లెక్కన ధరల పెరుగుదల వినియోగదారులకు పెనుభారంగా మారింది.

**ఉత్పత్తి పెరిగినా,తగ్గని బియ్యం ధరలు...**

రోజురోజుకు బియ్యం ధరలు పెరిగిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మధ్యతరగతి వాళ్ల కొనుగోలు చేయలేని విధంగా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మంచి నాణ్యమైన బియ్యం కావాలంటే కనీసం రూ. 75, 80 పెడితే తప్ప మార్కెట్‌లో బియ్యం దొరకని పరిస్థితి. కొత్త బియ్యం కనీస ధరలను చూస్తే రూ. 50, 55లు చెల్లించాల్సిన పరిస్థితి. హైదరాబాద్ నగరంలో ఎన్నడూ లేనంతగా బియ్యం ధరలు పెరిగిపోతుండడంతో మధ్యతరగతివారు బెంబేలెత్తిపోతున్నారు. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే బియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్‌లో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలో బియ్యం ఆశించిన స్థాయిలోనే సాగయ్యయని అధికారులు చెబుతున్నారు. ఇక తెలంగాణ రాష్ట్ర పరిస్థితి చూస్తే దాదాపుగా 80నుంచి 85 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం సేకరణ జరిగినట్లు చెబుతున్నారు. అయినప్ప టికి బియ్యం ధరలు మాత్రం అదుపులోకి రాలేదు. పైగా విపరీతంగా ధరలు పెరుగుతున్నాయి. గతేడాది కంటే ఈ ఏడు 15 నుంచి 25 లక్షల మెట్రిక్ టన్నుల వరి అధికంగా సేకరించినట్లు అధికారులు చెబుతున్నారు. అంతే తప్ప ధరల నియంత్రణ మాత్రం ఎక్కడా జరగడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

**అల్లం, వెల్లుల్లి దట్టించలేం...**

అల్లం, వెల్లుల్లి ధరలు వారం రోజుల వ్యవధిలోనే రూ.60 చొప్పున పెరిగాయి. అల్లం కిలో రూ.80 నుంచి రూ. 90కి, వెల్లుల్లి రూ. 350 నుంచి రూ.400 చేరాయి. మాల్స్‌లో వెల్లుల్లి ధర రూ.400 పలుకుతోంది. ఉల్లిపా యలు గత పక్షం రోజులుగా కిలో రూ.50కి తగ్గడం లేదు. ఎండుమిర్చి కారం ధర కిలో రూ.300 నుంచి రూ. 350కి చేరింది. మరోవైపు పప్పులు సైతం తామేం తక్కువ కాదన్నట్లు మండిపోతున్నాయి. మరోవైపు కంది పప్పు, పెసరపప్పు, ఎర్రపప్పు, మినపప్పులు సామాన్యులకు అందకుండా పోయాయి. గత ఏడాది పప్పుల ధర లను పోల్చిచూస్తే కిలోకు రూ10లు నుంచి రూ.30ల వరకు పెరిగాయి.కందిపప్పు కిలో ధర వారం వ్యవధిలో రూ.20 పెరిగి రూ.170కి చేరింది. పెసరపప్పు రూ.30 పెరిగి రూ.150కి, మినపపప్పు రూ.15 పెరిగి రూ. 145కి, సెనగపప్పు రూ.5 పెరిగి రూ. 110 పలుకుతోంది. నూనె తయారీ కంపెనీలు వెంటనే ధరలు పెంచాయి. దీనికి అనుగుణంగా వ్యాపారులు సైతం ధరలను ఇష్టా రాజ్యంగా పెంచారు. నగరంలోనే కాకుండా శివారు ప్రాంతాల్లో టోకు, చిల్లర దుకాణాల్లో అప్పటికే ఉన్న నిల్వలను కొత్త ధరలతో విక్రయించారు. మాల్స్‌లో మాత్రం గరిష్ఠ చిల్లర ధర(ఎమ్మార్పీ)పై జీఎస్టీ బిల్లులు ఇవ్వాల్సి ఉన్నందువల్ల ఎక్కువ ధరకు విక్రయిస్తే పట్టుబడతామన్న ఉద్దేశంతో నల్లబజారుకు తరలించారు. వాటిని రహస్యంగా హోటళ్లు, రెస్టారెంట్లకు కాసింత ఎక్కువ ధరకు విక్ర యిస్తున్నారు. వినియోగదారులు అడిగితే మాత్రం కొత్త స్టాక్ వస్తేనే విక్రయిస్తామని చెబుతున్నారు. వచ్చే నెలలో దసరా, దీపావళి పండగల వరకు వంటనూనెల ధరలు మరింత భగ్గుమనే అవకాశం ఉంది. మరోవైపు ధరలపై నియంత్రణ కరవైంది. మాల్స్, హోల్ సేల్ దుకాణాల వారు బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నా అధికారులు పట్టించు కోవడం లేదు. హోల్‌సేల్, రిటేల్ ధరల్లో కిలోకు ఐదు నుంచి 10 రూపాయలు వ్యత్యాసం ఉండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న నూనెలు, పప్పులతో పాటు నిత్యావసర వస్తువుల ధరలతో తమ వ్యాపారాలు తగ్గాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా భారంతో పాలు, కూరగాయలు ధరలు పెంచారని పేద, మధ్యతర గతి ప్రజలు ఆవేదన చెందుతున్నారు.ఇక చక్కెర, బెల్లం, కారంపొడి, చింతపండు ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని నిత్యావసరాల ధరలు అందనంత దూరానికి చేరాయి. పెరుగుతున్న ధరలను తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

**ధరలతో సరకులు కొనలేని పరిస్థితి**

**పి.భాను, కేశవ్‌నగర్, బోడుప్పల్**

మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయమేస్తోంది. ఏడాది కిందట రూ.500 లోపు ఉన్న ఐదు లీటర్ల అయిర్ టీన్ ఇప్పుడు రూ.650-రూ.750 వరకు దాటింది. పప్పులు, ఇతర నిత్యావసర సరకుల ధరలు అంతే స్థాయిలో పెరిగి పోయాయి. గతంలో వారానికి మూడుసార్లు పప్పు వండు కుని తినేవాళం..పెరిగిన ధరలతో ఒక్కసారికే పరిమితం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ధరలు ఇలానే పెరుగుతూ పోతే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కష్టంగానే ఉంటుంది. ప్రభుత్వాలు ధరలు నియంత్రణపై ప్రత్యేకం గా దృష్టిసారిస్తే బాగుంటుంది.

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు

**సైదాబాద్, జనవరి 12 ప్రభాతవార్త:**

భువనగిరి పార్టీ కార్యాలయంపై దాడిని నిరసిస్తూ బిఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు ఆదివారం బిఆర్ఎస్ నాయకులు ధర్నాలకు దిగే అవకాశముండడంతో పోలీసులు ముందస్తు అరెస్టులుచేశారు. చంపాపేటడివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి, గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలం, మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌తో పాటు నాయకులు సత్యనారాయణ, శ్రీకాంత్, బండారు సత్తిరెడ్డి, రమేష్, కృష్ణలను సరూర్‌నగర్ పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, నియంతల పాలన నడుస్తుందన్నారు.

## నేటినుంచి అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్

**కంటోన్మెంట్, జనవరి 12 ప్రభాతవార్త :**

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నగరంలో ఈ నెల 13 నుంచి మూడు రోజులపాటు 7వ అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ ఫ్లయర్స్‌ను ఆహ్వానిస్తూ, సికింద్రాబాద్‌లోకి పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ వేడుకలను నిర్వహించనుంది. పతంగుల పండుగకు ఇండోనేషియా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, కెనడా,కంబోడియా, స్కాంట్లాండ్, థాయ్‌లాండ్, కొరియా, పిలిప్పిన్స్, వియత్నాం, మలేషియా, ఇటలి, తైవాన్, సౌత్ ఆఫ్రీక, నెదర్లాండ్స్ దేశాలకు చెందిన 50మంది కైట్ ఫ్లయర్స్ హాజరవుతారు. వీరితోపాటు గుజరాత్, పంజాబ్, తమిళనాడు, కేరళ, హరియాణా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 60 మంది క్రీడాకారులు తరలిరానున్నారు. వీటిని తిలకించేందుకు సందర్శకులు వస్తుంటారు. ఇందు కోసం షామియానా టెంట్లు, తాగునీటి ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్లల కోసం ఆట వస్తువులు అందు బాటులో ఉంచారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు పతంగుల ప్రదర్శన ఉండనుంది.

**దేశదేశాలకు చెందిన స్వీట్లు, పిండి వంటలు....**

కైట్ ఫెస్టివల్‌తో పాటు స్వీట్ల పండుగను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణలో ప్రసిద్ధిపొందిన పిండి వంటలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ పిండి వంటలు, స్వీట్లు ఇందులో పరిచయం చేయనున్నారు. దాదాపు 1100 జాతీయ అంతర్జాతీయ స్వీట్లు, పిండివంటలను స్టాళ్లను ఏర్పాటుచేసి అందుబాటు లో పెట్టనున్నట్లు తెలిపారు.

ప్రత్యేకంగా ఈసారి ఇరాన్,తుర్కియే, అఫ్ఘనిస్తాన్ లతోపాటు మరో తొమ్మిది దేశాలకు చెందిన 700 మంది హోమ్ మేకర్స్ ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. దాదాపు 15లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉం దని, అందరికి ఉచితప్రవేశం ఉంటుందని తెలిపారు.



కైట్ ఫెస్టివల్ (ఫైల్)

